# దొంగ



■ సత్యనారాయణ కె. 'గాంధీ'

''ఈసారి దెబ్బలతోనే వదులుతున్నా. ఇంకోసారి పాకెట్ కొట్టినట్టు తెలిసిందో ప్రాణాలతో వదలను. గెట్ అవుట్'' అరిచాడు ఎస్.ఐ. ఓ సెల్యూట్ పడేసి బయటికి నడిచా. పోలీసు స్టేషన్ నుంచి బయటికి రాగానే ఎదురుగా వున్న పాన్‌షాప్‌లో టోనీకి బదులు జానీ కనిపించాడు.

''టోనిగాడేడి'' అడిగాను జానీని.

''వాడ్ని నిన్న సినిమా హాల్ దగ్గర బ్లాక్‌లో టికెట్లు అమ్ముతుంటే పట్టుకొన్నారు''.

''జానీ, నిన్నట్నుండి తిండి లేదు. ఏదైన హోటల్ కెళ్దాం పద'' అన్నాన్నేను. హోటల్ తిండి పొట్టలో పడేసరికి మళ్లీ ప్రాణాలొచ్చాయి. ఆరు నెలలు తిని సంపాదించిన బలాన్ని అరగంటలో పీల్చారు పోలీస్ నా కొడుకులు లాకప్‌లో. రూమ్‌లో బెడ్‌మీదొరిగాక అడిగా జానీని ''ఆ ముసలి నాకొడుకున్నాడా?''

''వాడికేం? ఏం జరగనట్లున్నాడు!'' నిర్లక్ష్యంగా అన్నాడు జానీ.

వాడికేం జరగనట్లున్నా, మొన్న, నిన్న జరిగింది నేనీ జన్మలో మరవను. ముప్పైవేల రూపాయిలు... ప్రయాణికులు... పోలీసులు... లాకప్... రాత్రి తాగొచ్చి కొట్టిన కానిస్టేబుల్స్...

''అసలేం జరిగింది దాదా'' జానీ అడిగాడు.

''నీకు తెలుసుగదా జానీ- భార్గవ ఎరువుల డిపోలో పనిచేసే ముసలోడు! వాడు ఏడాది క్రితం పెళ్లికాని ముగ్గురు కూతుళ్ళతో నా ఏరియాలో దిగాడు. వాడు, ఆ షాప్ సేఠ్ రోజు 20, 30 వేలు బాంక్‌లో జమ చేయడానికి 40 నంబరు బస్సులో వెళతారు. చాలా జాగ్రత్త మనిషి. వాడి దగ్గర్నుండి కాష్ కొట్టెయ్యడం కష్టం అయింది. అందుకని వాడ్ని ఇంట్లోనే కలిసి బెదిరిద్దాం అని నేను, టోని వెళ్లి ఓ అరగంట చర్చ జరిపి కొట్టేసిన డబ్బులో 50% షేర్‌కి వొప్పించాం. మా ఒప్పందం ప్రకారం కాష్ అంతా వాడి జేబులో ఉంటుంది. బస్సెక్కిన కొద్ది సేపట్లో వాడి డబ్బు కొట్టేస్తాను. వాడికి తెలిసినా, నేను బస్సుదూకిన తర్వాత వాడు డబ్బు కొట్టేసారని అరవాలి. కాని వాడు నిన్న నేను బస్సు దిగకముందే భయంతో అరిచాడు. ప్రయాణికులు పట్టుకొని పోలీసులకప్పజెప్పారు. టోని ప్రయాణికుల్లో ఒకడిలాగా ఉండిపోయాడు. ఆ డబ్బుని బాంక్‌లోను, నన్ను లాకప్‌లోను వేసారు. ఆ సాయంత్రం ఎస్.ఐ.గాడొచ్చి వాడి బూటు కాలుతో దొరికిన చోటల్లా తన్ని, ఆర్డర్ ఇచ్చేసి వెళ్ళాడు. ఆ పోలీస్ ముండా కొడుకులు నా జేబులోని డబ్బుతోనే తాగొచ్చి రాత్రి రెండు గంటలకు లేపి వారి మత్తు దిగేదాకా కొట్టారు. ఈ సాయంత్రం ఎస్.ఐ. వస్తే బతిమిలాడినందుకు వాడు నా తల్లిని, పెళ్లాన్ని వాడికిష్టమైన భాషలో తిట్టి వొదిలేసాడు.''

నా కళ్ళలో తీవ్రంగా నీళ్ళు తిరగడం జానీ కంట పడింది.

''ఇప్పుడేం చేద్దామని దాదా!'' అన్నాడు జానీ.

''జానీ... రేపు ఆ ముండాకొడుకుల్ని చంపైనా సరే ఆ డబ్బు కాజెయ్యాలి. నువ్వు ప్రయాణికుల్లో కలిసిపోయి నన్నెవడూ పట్టుకోకుండా చూడాలి'' పట్టుదలతో అన్నాను. జానీ తలూపాడు.

ఆ తరువాత రేపటి వ్యూహం గురించి ఆలోచనల్లో పడిపోయాం.

* * * * *

మర్నాడు ముసలాడి కంటపడకుండా బస్సు స్టాప్‌కి దూరంగా నిలబడిపోయాన్నేను. జానీ పరిగెత్తుకొచ్చాడు నా దగ్గరకు. ''దాదా ఈ రోజు ముసలాడొక్కడే పాకెట్‌తో వస్తున్నాడు. మన పని కొంత తేలికవుద్ది'' అన్నాడు. నేను తలూపా. 40 నంబరు బస్సొచ్చింది. ముసలాడు ముందెక్కాడు. జానీ, నేను చివర్నెక్కాం. కొద్ది సేపట్లో మేమిద్దరం ముసలాడి వెనక నిలబడ్డాం. బస్సు కుదుపుల్లో చాకచక్యంగా వాడి పక్క జేబులోని పాకెట్ కొట్టేసాం కాని, వాడు అది గమనించాడు. దొంగా... దొంగా... అని అరవటం మొదలెట్టాడు. ఈసారి ఆలస్యం చేయకుండా జానీ సహాయంతో వేగంగా ఉన్న బస్సులోంచి బయటికి దూకేసా. రెండు మూడు సందుల్ని, రెండు ఆటోల్ని మార్చి శివనగర్‌లోని ఓ చిన్న హోటల్‌లో కూర్చున్నాను. జానీ మరో అర గంటలో వస్తే, దానిని పంచుకొని హైదరాబాద్‌కో, విజయవాడకో వెళ్లిపోవాలని ప్లాన్ వేసుకొన్నాం. గుండె దడ తగ్గాక మెల్లగా పాకెట్ విప్పాను. అంతే ఈసారి నా గుండె ఆగిపోయినంత పనైంది. అరగంటలో జానీ రానే వచ్చాడు. మూడు పాకెట్ల సిగరెట్లు కాల్చాను. జానీ నాకెదురుగా కూర్చోగానే అన్నాను ''జానీ ఆ ముసలాడు మనల్నిద్దర్ని ఫూల్స్ చేసాడు.''

''అవును దాదా. నీవు పారిపోగానే వాడు ఏడ్చి, అరిచి, వాడి ఫామిలీ సెంటిమెంటల్ స్టోరీ చెప్పి బస్సులో వెయ్యి, పదిహేను వందల్దాక అడుక్కున్నాడు. బయట కూడా మరో 500 రూపాయిలు అడుక్కోవచ్చు. పాకెట్‌లో నలభై వేలున్నాయన్నాడు. పరవాలేదు చెరో 20 వేలు వస్తాయన్న మాట'' ఆనందంగా అన్నాడు జానీ.

''చందా అడుక్కొన్నాడా! పైగా నలభై వేలున్నాయన్నాడా ఆ పాకెట్‌లో?!'' ఆశ్చర్యంగా నోరు తెరిచా.

''ఏం నలభై వేలకంటె తక్కువున్నాయా! ఏవి ఇటివ్వు'' అన్నాడు చేయి చాస్తూ.

''నువ్వే చూడు'' పాకెట్ వాడికందించా.

వాడు దాన్నిప్పి ''ఇదేమిటి ఇదేదో పురుగుల మందులా ఉంది'' అన్నాడు.

''అవును గమాక్సిన్! మామూలుగా ఇళ్లల్లో పీనులు చావడానికి వేస్తారు. అదే ఆ ముసలాడి పాకెట్‌ని కొట్టేసి నేను సంపాదించిన నలభై వేలు'' అన్నాను బాధగా.

వాడి పాకెట్ కత్తిరించినప్పుడే నాకు మెత్తగా తగిలితే అనుమానమొచ్చింది. కాని ఆ గొడవలో దాన్ని అంతగా పట్టించుకోలేదు. ఇప్పుడు నిజమైన దొంగ వాడో, నేనో అర్థం కాలేదు నాకు.

జానీ ఇంకా తెరిచిన నోరు మూయనేలేదు. ■